

సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
సోమవారం । 10 । మార్చి । 2025



అమ్ముదామా.. ఆగుదామా !
మిర్చి పంటకు ఆశించిన ధర రాకపోవడంతో ఇప్పుడే అమ్ముదామా, కొంత కాలం ఆగుదామా అని రైతులు సందిగ్ధంలో పడ్డారు. 8లో



రంజాన్ వేళలు
ఇఫ్తార్ (సోమవారం సా॥) 6.23
సహర్ (మంగళవారం ఉ॥) 5.04

వాతావరణం
గరిష్టం / కనిష్టం 38° / 20°
జిల్లాలో సోమవారం ఉదయం ప్రారంభమైన ఎండ మధ్యాహ్నానికి తీవ్రం అవుతుంది. రాత్రి వాతావరణం కొంత చల్లబడుతుంది.

న్యూస్‌రీల్

రామయ్యకు పుష్పార్చన

భద్రాచలం : భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి మూలమూర్తులకు ఆదివారం అభిషేకం, సువర్ణ పుష్పార్చన వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆదివారం సెలవు కావడంతో భక్తులు భారీగా తరలివచ్చారు. స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పెద్దమ్మతల్లి ఆలయ కమిటీ ఇదే..

పాల్వంచరూరల్ : పెద్దమ్మతల్లి ఆలయ పాలక మండలి సభ్యులుగా 15 మంది పేర్లతో కూడిన జాబితా నాలుగు రోజుల క్రితం ప్రిన్సిపల్ సెక్రటరీ ద్వారా ఈఓకు అందింది. ఈ జాబితాలో జమ్ముల రాజశేఖర్, బి.సాంబమూర్తి, బండి చిన్న వెంకటేశ్వర్లు, నూనవత్ సుమన్‌నాయక్, భుక్యా గిరిప్రసాద్, కొమరం స్వర్ణలత, పి.రామయ్య, సంకా వెంకట రామరావు, సందుపట్ల రమ్య, ధర్మరాజుల నాగేశ్వరరావు, చెరుకూరి శేఖర్‌బాబు, ఎస్.సత్యనారాయణ, యర్రంశెట్టి నర్సింహారావుతో పాటు ఎక్స్‌అఫిషియో సభ్యుడిగా అర్చకులు రవికుమార్‌శర్మ ఉన్నారు.

కమిటీపై తర్జన భర్జన..
నాలుగు రోజుల క్రితం ఆలయ ఈఓకు జీఓ 66 ద్వారా వచ్చిన ఈ సర్క్యులర్‌పై అంతర్గతంగా తర్జన భర్జనలు జరుగుతున్నాయి. ఇంతకూ ఈ కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేస్తారా? మార్పులు, చేర్పులు జరుగుతాయా అనేది చర్చనీయాంశంగా మారింది. స్థానికులకు కమిటీలో అవకాశం ఇవ్వకుండా ఇతర ప్రాంతాల వారిని, పార్టీకి వ్యతిరేకంగా పనిచేసిన వారిని ట్రస్ట్ సభ్యులుగా ఎలా నియమిస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు. కాగా, కమిటీ ప్రమాణ స్వీకారంపై ఈఓ రజనీకుమారిని వివరణ కోరగా జాబితా వచ్చిందని, అయితే దేవాదాయ శాఖ కమిషనర్, ఏసీల నుంచి వచ్చే ప్రొసీడింగ్ ఆధారంగా ఖరారు చేస్తామని తెలిపారు.

ఇంటిగ్రేటెడ్ గురుకులాలకు నిధులు

రూ.200 కోట్ల చొప్పున ఏడింటికి మంజూరు

ఇల్లెందు/కొత్తగూడెం అర్బన్: ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ కాంప్లెక్స్ (వైఐఆర్‌ఎస్) భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా 55 నియోజకవర్గాల్లో భవనాలకు రూ.11వేల కోట్లు మంజూరు చేస్తూ విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితారాణా పేరిట ఉత్తర్వులు వెలువడ్డాయి. ఒక్కో గురుకుల భవనానికి రూ.200 కోట్లు కేటాయించగా జాబితాలో ఉమ్మడి జిల్లా నుంచి ఏడింటికి స్థానం దక్కింది. ఖమ్మం, పాలేరు, సత్తుపల్లి, వైరా, ఇల్లెందు, కొత్తగూడెం, పినపాక ఉన్నా యి. కాగా, ఒక్కో భవనాన్ని 25 ఎకరాల్లో నిర్మించనుండగా వివిధ చోట్ల మంత్రులు కొన్నాళ్ల క్రితమే శంకుస్థాపన చేశారు. ఇప్పుడు నిధులు మంజూరు చేయడంతో పాటు తదుపరి చర్యలు చేపట్టాలని టీజీఈడబ్ల్యూడీసీ(తెలంగాణ స్టేట్ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్)ను ఆదేశించారు. దీంతో భవనాల నిర్మాణానికి టెండర్లు ఖరారు చేసి త్వరలోనే పనులు ప్రారంభించే అవకాశముంది. ఇక ఇల్లెందు నియోజకవర్గంలో ఇల్లెందు – కారేపల్లి క్రాస్ మీదుగా మహబూబాబాద్ రోడ్డులో మున్సిపల్ డంప్ యార్డు సమీపాన 25 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని గుర్తించడమే కాక అక్కడ సాగులో ఉన్న పలువురికి నోటీసులు కూడా జారీ చేశారు.

అదరం.. ఇక బెదరం



స్కూల్‌లో సీనియర్ అబ్బాయిని ఇష్టపడిందో టీనేజ్ అమ్మాయి. పై చదువులకు వెళ్లే క్రమంలో కెరీర్‌పై దృష్టి పెట్టింది. ఇది సహించలేని సదరు అబ్బాయి.. 'నాతో మాట్లాడిన విషయాలన్నీ మీ ఇంట్లో చెబుతా'నంటూ బెదిరించడం మొదలుపెట్టాడు. ఇంట్లో చెబితే చదువు ఆపేస్తారు. చెప్పకుంటే వేధింపులు ఆగవు.

గ్రాడ్యుయేషన్ చదివే రోజుల్లో అమ్మాయికి ఓ అబ్బాయి ప్రపోజ్ చేశాడు. బాగా చదువుకున్న అమ్మాయి ప్రభుత్వ ఉద్యోగం చేస్తోంది. మరోవైపు జులాయిగా తిరిగే ఆ అబ్బాయి కెరీర్‌లో ఎంతకీ స్థిరపడలేదు. చివరకు ఇంట్లో వాళ్లు చూసిన సంబంధం చేసుకునేందుకు సదరు యువతి సిద్ధమైంది. అంతే గతంలో రాసుకున్న ప్రేమలేఖలు బయటపెడాతనంటూ ఆ యువతికి బ్లాక్‌మెయిలింగ్ చేయడం ప్రారంభించాడా యువకుడు.

ఓ వివాహితకు సోషల్ మీడియాలో ఓ వ్యక్తి పరిచయం అయ్యాడు. కుటుంబ కలతల కారణంగా విషాదంలో ఉన్న ఆమెను ఓదార్చాడు. ఆ ఓదార్పు మాయలో పడి తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన వివరాలు అతనితో చెప్పింది. ఆ తర్వాత నుంచి వేధింపులు మొదలయ్యాయి. అడిగినంత డబ్బులు ఇవ్వకుంటే మనిద్దరి మధ్య ఏదో ఉందని నీ భర్తకు చెబుతానంటూ నరకం చూపించడం ప్రారంభించాడు.

ఇవన్నీ చాలా సున్నితమైన అంశాలు. బయటకు చెప్పుకుంటే పరువు సమస్య, కాదంటే దినదిన గండంగా బతకాల్సిన పరిస్థితి. నమ్మిన వాళ్ల చేతిలో మోసపోయిన వారిని ఆ ఆపద నుంచి బయటపడేసేందుకు తామున్నామంటూ భరోసా ఇస్తోంది షీ టీమ్.

– సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

- పలు రకాలుగా వంచనకు గురవుతున్న మహిళలు
- 'పరువు' పేరుతో కొందరి బెదిరింపులు
- సోషల్ మీడియా వేదికగా మాటల దాడి
- బాధిత మహిళలకు భరోసాగా 'షీ టీమ్'

మోసపోయిన వారే ఎక్కువ..
షీ టీమ్‌ను ఆశ్రయిస్తున్న వారిలో ఎక్కువ శాతం మంది నమ్మిన వ్యక్తుల చేతిలో మోసపోయిన వారే. ప్రేమ, పరిచయస్తులనే పేరుతో సన్నిహితంగా ఉన్నప్పుడు పంచుకున్న విషయాలను సదరు స్త్రీ/యువతి కుటుంబ సభ్యులకు, బాహ్య సమాజానికి చెబుతామంటూ బెదిరింపులకు దిగుతున్నారు. గతంలో ఇలాంటి సందర్భాల్లో భయపడిన మహిళలు మరింత లోతుగా సమస్యల్లో కూరుకుపోయేవారు. కానీ ప్రస్తుతం ఈ పరిస్థితిలో మార్పు వస్తోంది. బెదిరిస్తే భయపడేది లేదంటున్నారు.

గోప్యతకు ప్రాధాన్యత
ఇద్దరి మధ్య జరిగిన విషయాలను బయటి ప్రపంచానికి వెల్లడి చేస్తానంటూ జరిగే బెదిరింపుల్లో ఫిర్యాదుదారుల వివరాలను రహస్యంగా ఉంచడం ఎంతో కీలకం. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఫిర్యాదు అందింది మొదలు పరిష్కారం వరకు మహిళల గోప్యతకు భంగం వాటిల్లకుండా వివాదాలను పరిష్కరించడంపై షీటీమ్ వారు జాగ్రత్త పడుతున్నారు. బాధితులు 87126 82131 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచిస్తున్నారు.

సోషల్ మీడియా మాటున..
సోషల్ మీడియా ఖాతాలను ఆసరా చేసుకుని ఆన్‌లైన్‌లో మహిళలను వేధించే పోకిరీలు జిల్లాలోనూ పెరిగిపోతున్నారు. గతేడాది జిల్లా వ్యాప్తంగా 1,639 సైబర్ నేరాలు నమోదయ్యాయి. ఇందులో దాదాపు 15 శాతం అంటే 239 కేసులు మహిళలపై వేధింపులకు పాల్పడినవే. ఇంతకు నాలుగింతలుగా సోషల్ మీడియా కారణంగా బయట స్త్రీలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సాధారణంగా ఆన్‌లైన్ వేదికగా వేధింపులు మొదలైన వెంటనే ఖాతా బ్లాక్, డీయాక్టివేట్ చేస్తుంటారు. అయినా పనికట్టుకుని ఇబ్బంది పెట్టినప్పుడే ఫిర్యాదుల వరకు వస్తున్నాయి. వేధింపులకు గురి చేసే వాళ్లలో ఎక్కువ మంది పరిచయస్తులే ఉండడం గమనార్హం

సేవల విస్తరణ..
కాలేజీలు, బస్టాండ్ల దగ్గర విద్యార్థినులను ఇబ్బంది పెట్టే పోకిరీల ఆట కట్టించేందుకు షీ టీమ్ చర్యలు తీసుకుంటోంది. రద్దీ ప్రదేశాల్లో 'గ్రూపింగ్'కు పాల్పడే వ్యక్తులపైనా నజర్ పెడుతోంది. ఐదేళ్ల క్రితం జిల్లా కేంద్రంలో ఒక మహిళా ఎస్సై, ఒక మహిళా కానిస్టేబుల్, ముగ్గురు కానిస్టేబుళ్లతో ఏర్పాటైన షీ టీమ్.. ఇటీవల భద్రాచలంలోనూ సేవలు ప్రారంభించింది. త్వరలో డివిజన్‌కు ఒకటి వంతున సేవలు విస్తరించేలా జిల్లా పోలీస్ యంత్రాంగం కార్యాచరణ రూపొందిస్తోంది.

బాధితులకు మనోధైర్యం..
బాధితులు నేరుగా లేదంటే ఫోన్ ద్వారా షీ టీమ్‌ను ఆశ్రయిస్తున్నారు. అలాంటి వారితో మాట్లాడిన షీ టీమ్ పోలీసులు బాధితులకు ధైర్యం కల్పిస్తున్నారు. ఆ తర్వాత వేధింపులకు పాల్పడే వారికి కౌన్సెలింగ్ ఇవ్వడం ద్వారా పరిస్థితిలో మార్పు తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. అప్పటికీ వినకుంటే భారత న్యాయ సంహిత ప్రకారం ఎలాంటి పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందో చెబుతున్నారు. అయినా దారిలోకి రాకుంటే ఎఫ్ఐఆర్ నమోదు చేసేందుకు సైతం వెనుకాడడం లేదు. అయితే చాలా సందర్భాల్లో కౌన్సెలింగ్ దశలోనే సమస్యలు పరిష్కారం అవుతున్నాయి.

కొత్తగూడెం షీ టీమ్ దృష్టికి వచ్చిన ఫిర్యాదులిలా..

సంవత్సరం	కౌన్సిలింగ్	పెటీ కేసులు	ఎఫ్ఐఆర్	మొత్తం
2024	106	84	76	266
2025	08	18	18	44

(ఫిబ్రవరి వరకు)

అభివృద్ధిలో ముందుంచుతాం



మాట్లాడుతున్న కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పక్కన భట్టి, పొంగులేటి, ఎమ్మెల్యేలు, ఎంపీలు

- అత్యవసర పనులకు మినరల్, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ఫండ్ వినియోగించుకోండి
- ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధుల సమావేశంలో మంత్రి కోమటిరెడ్డి
- హాజరైన డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి పొంగులేటి, ఎంపీలు, ఎమ్మెల్యేలు

సాక్షిప్రతినిధి, ఖమ్మం : ఉమ్మడి ఖమ్మం జిల్లా సమగ్రాభివృద్ధికి కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం వ్యూహాత్మక ప్రణాళికలతో ముందుకుపోతోందని, ఉమ్మడి జిల్లాను అభివృద్ధిలో మొదటి స్థానంలో నిలుపుతామని ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. ఉమ్మడి జిల్లా సమగ్రాభివృద్ధిపై ఆదివారం ఆయన హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశానికి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీలు రేణుకాచౌదరి, పోరిక బలరాం నాయక్, రామసహాయం రఘురాంరెడ్డితో పాటు జిల్లా ఎమ్మెల్యేలు హాజరయ్యారు. జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను మరింత వేగంగా పూర్తి చేసేందుకు అనుసరించాల్సిన విధానాలపై మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ వేసవిని దృష్టిలో పెట్టుకొని జిల్లాలో తాగు, సాగునీరు, విద్యుత్ సరఫరా వంటి అంశాలను కూలంకషంగా చర్చించినట్లు తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాను అన్ని రంగాల్లో నంబర్ వన్‌గా నిలబెట్టేందుకు అనుసరించాల్సిన ప్రణాళికలపై విస్తృతంగా చర్చించామన్నారు. జిల్లాలో అత్యవసర అభివృద్ధి పనులకు మినరల్ ఫండ్, జిల్లా అభివృద్ధి నిధులు, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి నిధులను వినియోగించుకోవాలని ప్రజాప్రతినిధులకు సూచించారు. హ్యామ్ రోడ్ల మంజూరులో ఉమ్మడి జిల్లాకు ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. జిల్లాలో పార్టీని మరింత పటిష్టం చేస్తామని అన్నారు. సమావేశంలో పినపాక, భద్రాచలం, వైరా, సత్తుపల్లి, అశ్వారావుపేట, ఇల్లెందు ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావ్, మాలోత్ రాందాస్ నాయక్, మట్టా రాగమయి, జారే ఆదినారాయణ, కోరం కనకయ్య పాల్గొన్నారు.

రామయ్యను దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి

- పెద్దమ్మతల్లి ఆలయంలో పూజలు
- కొత్తగూడెం కోర్టులో వెయిటింగ్ హాల్ ప్రారంభం

భద్రాచలంఅర్బన్/పాల్వంచరూరల్/కొత్తగూడెం టౌన్ : భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారిని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నందా ఆదివారం దర్శించుకున్నారు. ఆమెకు ఈఓ రమాదేవి స్వాగతం పలకగా వైదిక పెద్దలు ఆశీర్వచనం అందజేశారు. ప్రధాన ఆలయంతో పాటు ఆంజనేయస్వామి, లక్ష్మీతయారమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. అనంతరం జస్టిస్ నందా భద్రాచలం జ్యుడీషియల్ కోర్టును సందర్శించారు. ఈ సందర్భంగా పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఆ తర్వాత బార్ అసోసియేషన్ సభ్యులు సన్మానించి రాముల వారి ప్రతిమ అందజేశారు. అనంతరం జస్టిస్ నందా పెద్దమ్మతల్లి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించగా ఈఓ రజనీకుమారి జడ్జికి అమ్మవారి శేషవస్త్ర ప్రసాదాలు అందజేశారు.

కొత్తగూడెం కోర్టులో..
కొత్తగూడెం కోర్టులో నిర్మించిన వెయిటింగ్ హాల్‌ను న్యాయమూర్తి సూరేపల్లి నందా ఆదివారం ప్రారంభించారు. ఆమెకు జిల్లా జడ్జి పాటిల్ వసంత్, కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నందా మాట్లాడుతూ.. న్యాయ సేవలను అందుబాటులోకి తేవడంలో, లీగల్ అవేర్‌నేస్ కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టడంలో న్యాయవాదులు కీలకపాత్ర పోషిస్తున్నారని అభినందించారు. ఆయా కార్యక్రమాల్లో భద్రాచలం ప్రథమ శ్రేణి న్యాయమూర్తి శివనాయక్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి బత్తుల రామారావు, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె.సాయిశ్రీ, మణుగూరు, దమ్మపేట జూనియర్ సివిల్ జడ్జీలు కె. సూరిరెడ్డి, బి.భవానీ, ఎస్పీ రోహిత్‌రాజు, ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, భద్రాచలం, కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షులు కోట దేవదానం, లక్కినేని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



హైకోర్టు న్యాయమూర్తికి ప్రతిమ అందిస్తున్న భద్రాచలం 'బార్' సభ్యులు

పెద్దమ్మతల్లికి విశేష పూజలు

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని కేశవాపరం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువుదీరిన శ్రీ కనకదుర్గమ్మ(పెద్దమ్మతల్లి) అమ్మవారికి అర్చకులు ఆదివారం విశేష పూజలు చేశారు. జిల్లా నలుమూలలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. క్యూలైన్ల ద్వారా అమ్మవారిని దర్శించుకున్న భక్తులు.. పసుపు, కుంకుమ, చీరలు, ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు విశేష పూజలు నిర్వహించారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

నేడు హుండీ లెక్కింపు..
పెద్దమ్మతల్లి అమ్మవారికి భక్తులు సమర్పించిన హుండీ కానుకలను సోమవారం ఉదయం 8 గంటల నుంచి లెక్కించనున్నట్లు ఈఓ రజనీకుమారి తెలిపారు.

సింగరేణిలో ముగిసిన పరీక్షలు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో ఖాళీ పోస్టులకు ఇంటర్నల్ అభ్యర్థులతో నిర్వహించిన మూడు రకాల పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా ముగిశాయి. జూనియర్ మైనింగ్ ఆఫీసర్ (ఈ గ్రేడ్ –1) 87 పోస్టులకు 21 మంది దరఖాస్తు చేసుకోగా 17 మంది మాత్రమే పరీక్షకు హాజరయ్యారు. ఇక జూనియర్ ఆఫీసర్ (ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్) నాలుగు పోస్టులకు ఆరుగురు దరఖాస్తు చేసుకోగా ఐదుగురు, జూనియర్ సర్వే ఆఫీసర్ 64 పోస్టులకు 71 మంది దరఖాస్తు చేసుకుని 67 మంది పరీక్షకు హాజరయ్యారు. మొత్తం మూడు విభాగాల్లో 155 ఖాళీలకు 98 మంది మాత్రమే దరఖాస్తు చేసుకోగా, అందులోనూ 89 మంది మాత్రమే పరీక్ష రాశారని సింగరేణి యాజమాన్యం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. స్థానిక సింగరేణి మహిళా డిగ్రీ కళాశాలలో పరీక్షలు నిర్వహించగా రిక్రూట్‌మెంట్ సెల్ జీఎం నికోలస్ పర్యవేక్షించారు. పరీక్ష ఫలితాలను ఆదివారం రాత్రికే సింగరేణి వెబ్‌సైట్‌తో పాటు, సింగరేణి ప్రధాన కార్యాలయంలోని నోటీస్ బోర్డ్‌లో ప్రదర్శించినట్లు తెలిపారు.



పరీక్ష కేంద్రంలో పర్యవేక్షిస్తున్న జీఎం

నేడు ఐటీడీఏలో గిరిజన దర్బార్

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ఐటీడీఏలో సోమవారం గిరిజన దర్బార్ నిర్వహించనున్నట్లు పీఓ రాహుల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్నిశాఖల యూనిట్ అధికారులు ఉదయం 10.30గంటల వరకు తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే గిరిజనులు తమ సమస్యలను లిఖితపూర్వకంగా రాసిఇవ్వాలని పేర్కొన్నారు.

నేడు ప్రజావాణి

కొత్తగూడెంఅర్బన్: స్థానిక ఐడీఓసీలో సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల జిల్లా అధికారులు సకాలంలో హాజరుకావాలని సూచించారు. ప్రజలు వారి సమస్యలపై లిఖిత పూర్వకంగా ఫిర్యాదు అందజేయాలని పేర్కొన్నారు.

'తాయిలం' అందేనా ?

- ఏటా రామాలయంపైనే ఉత్సవాల భారం
- నిర్వహణ ఖర్చులకు హుండీ ఆదాయమే మార్గం
- ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూపులు

భద్రాచలం: భద్రగిరి రామయ్యకు సర్కారు తాయిలం అందడం లేదు. ప్రతీ ఏడాది ఉత్సవాల సమయంలో ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తున్నా నిరుత్సాహమే మిగులుతోంది. దేవస్థానంలో జరిగే ప్రధాన ఉత్సవాల నిర్వహణ వ్యయం తలకు మించిన భారం అవుతుండడంతో అధికారులు తల పట్టుకుంటున్నారు. చివరికి భక్తులు సమర్పించే హుండీ ఆదాయమే దిక్కుగా మారడంతో ఆ నిధులనే ఉత్సవాల నిర్వహణకు ఖర్చు చేయాల్సి వస్తోంది. దీంతో ఆలయ అభివృద్ధి కుంటుపడుతోందని ఇటు భక్తులు, అటు అధికారులు ఆవేదన చెందుతున్నారు.

నవమి వ్యయం రూ.2 కోట్లకు పైగానే..
భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో జరిగే ఉత్సవాల్లో ముక్కోటి, శ్రీరామనవమి ముఖ్యమైనవి. వీటితో పాటు భక్తరామదాసు జయంతి ఉత్సవాలనూ ఘనంగా నిర్వహిస్తారు. అయితే వీటిలో ముక్కోటి సందర్భంగా తెప్పోత్సవం, ఉత్తర ద్వార దర్శనం, శ్రీరామనవమి వేడుకలకు భక్తులు భారీగా హాజరవుతుంటారు. ఆ సమయాల్లో విధులు నిర్వహించే సిబ్బంది సైతం వందల సంఖ్యలో ఉంటారు. కాగా, ఈ ఉత్సవాల నిర్వహణకు అధిక మొత్తంలో ఖర్చవుతుంది. వస్తువుల ధరలు, వివిధ విభాగాల కార్మికుల జీతభత్యాలు పెరుగుతుండగా ఏటేటా నిర్వహణ వ్యయం సైతం పెరుగుతోంది. గతంలో రూ. కోటి – కోటిన్నర మధ్యలో ఖర్చు కాగా, ఈ ఏడాది రూ.రెండు కోట్లకు పైగానే అవసరమని అధికారులు అంటున్నారు. వీటిలో ఉత్సవ నిర్వహణ పనులకు రూ.కోటిన్నర, క్రతువు నిర్వహణ, తలంబ్రాలు, పట్టువస్త్రాలు, ఇతర ఖర్చులకు మరో కోటి వరకు ఖర్చవుతుందని అనధికారికంగా చెబుతున్నారు. ముక్కోటికి సైతం రూ.కోటిన్నర వరకు వ్యయం అవుతున్నట్లు అంచనా.

కాంగ్రెస్ సర్కారైనా..
తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం దేవస్థానంలో ఉత్సవాల నిర్వహణకు ఒక్క పైసా విదల్చలేదు. ఆలయ అభివృద్ధికి రూ.100 కోట్లు ఇస్తామన్న హామీని సైతం విస్మరించింది. ఇక ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ సర్కారైనా నిధులు ఇవ్వకపోతుందా అని భక్తులు కోటి ఆశలు పెట్టుకున్నారు.

ఖర్చులకు కానుకలే దిక్కు..
భద్రాచలంలో జరిగే శ్రీరామనవమి వేడుకలకు రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు ఉంటుంది. అయితే ప్రభుత్వం నుంచి అందే సాయం మాత్రం రూ.15వేలు మాత్రమే. అది కూడా పేపర్లపై లెక్కలు చూపడం మాత్రమే. అంతకుమించి ఒక్క రూపాయి కూడా ప్రభుత్వం నుంచి వచ్చేది లేదు. నవమి వేడుకలకు సాయం అందించాలని అటు అధికారులు, ఇటు భక్తులు ప్రభుత్వానికి విన్నవిస్తున్నా ఫలితం లేదు. రెండేళ్లకోసారి జరిగే మేడారం జాతరకు అందించే స్థాయిలో కాకున్నా భక్తుల మనోభావాలను గౌరవించి ఉత్సవాల నిర్వహణకు ఎంతో కొంత అందించాలని పలువురు కోరుతున్నారు. కాగా హుండీల ద్వారా భక్తులు సమర్పించే కానుకలనే ఉత్సవాల నిర్వహణకు వెచ్చిస్తున్నారు. గతం కంటే ఆదాయం పెరిగినా ఆలయ అభివృద్ధికి, భక్తులకు మరింతగా వసతుల కల్పనకు వెచ్చించాల్సిన నిధులను ఉత్సవాల కోసం ఖర్చు చేయాల్సి వస్తోంది. భద్రాచలంలో భక్తులకు వసతి కష్టాలు నిత్యం ఎదురవుతుంటాయి. ఆలయానికి వచ్చే ఆదాయంతో రంగనాయకుల గుట్ట మీద, కింద దేవస్థానం భూముల్లో డార్మెటరీ, 100 గదుల వసతి గృహాలను నిర్మిస్తే ఈ సమస్య తీరే అవకాశం ఉంటుంది.



రామాలయం వ్యూ

గతేడాది శ్రీరామనవమి ఉత్సవాలకు నిధులు కేటాయిస్తుందని భావించినా విడుదల చేయలేదు. ఈ ఏడాదైనా రామయ్యపై కరుణ చూపేనా అని భక్తులు, అధికారులు ఆశగా ఎదురు చూస్తున్నారు. గత ఏడాది ఎన్నికల కోడ్ కారణంగా సీఎం హోదాలో రేవంత్ రెడ్డి హాజరు కాలేదు. ఈ ఏడాది హాజరు కావడంతో పాటు ఆలయ అభివృద్ధిపై స్పష్టమైన హామీ ఇచ్చే అవకాశం ఉందని పలువురు ఆశిస్తున్నారు.

తక్షణమే సాయం అందించాలి



భక్తుల ఆదాయం భక్తులకే చెందాలి. ఉత్సవాల నిర్వహణ పేరుతో పక్కదారి పట్టించడం సరైంది కాదు. హుండీ ఆదాయాన్ని భక్తుల వసతుల కల్పనకు కేటాయించాలి. ఆలయంలో జరిగే ఉత్సవాల నిర్వహణ బాధ్యతను ప్రభుత్వం స్వీకరించాలి. వీటికి అయ్యే ప్రతి పైసా ప్రభుత్వమే భరించాలి.

– బూసిరెడ్డి శంకర్ రెడ్డి, భద్రాద్రి పరిరక్షణ సమితి అధ్యక్షుడు

కిన్నెరసానిలో పర్యాటకుల సందడి

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని కిన్నెరసానికి ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. జిల్లా నలుమూలలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా భారీగా తరలివచ్చారు. డ్యామ్ పైనుంచి జలాశయాన్ని, డీర్‌పార్కులో దుప్పులను వీక్షించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందోత్సాహాల నడుమ గడిపారు. 338 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించడం ద్వారా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.11,410, 250 మంది బోటింగ్ చేయడం ద్వారా టూరిజం కార్పొరేషన్‌కు రూ.11,970 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.

క్లుప్తంగా

ఐలయ్య ఆదర్శప్రాయుడు



మాట్లాడుతున్న తమ్మినేని, పక్కన జాన్‌వెస్లీ తదితరులు

సుజాతనగర్: అమరజీవి కాసాని ఐలయ్య ఆదర్శప్రాయుడని, ఆయనను ప్రతీ ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం, సీపీఎం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శులు జాన్‌వెస్లీ, కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. సుజాతనగర్‌లో ఆదివారం జరిగిన సంస్మరణ సభలో వారు మాట్లాడారు. కొత్తగూడెం ప్రాంతంలో ప్రజా ఉద్యమాన్ని నిర్మించడంలో కాసాని ఐలయ్య అనేక ఆటుపోట్లు ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. ఐలయ్య స్ఫూర్తితో రాజ్యాంగ పరిరక్షణ ఉద్యమాలు చేస్తామని ప్రకటించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం కాసాని ఐలయ్య అలుపెరుగని పోరాటాలు సాగించారని గుర్తు చేశారు. సభలో పలువురు జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

15 నుంచి చర్లలో అంతర్రాష్ట్ర క్రికెట్ టోర్నీ

చర్ల: ఈ నెల 15 నుంచి మండలంలో నక్కిబోయిన శ్రీనివాసరావు జ్ఞాపకార్థం అంతర్రాష్ట్ర క్రికెట్ పోటీలను నిర్వహించనున్నట్లు చర్ల యూత్ ఒక ప్రకటనలో తెలిపింది. చర్ల (రాళ్లగూడెం)లోని రాళ్లగూడెం క్రీడా మైదానంలో నిర్వహించే పోటీలకు 13వ తేదీ వరకు ఎంట్రీలు నమోదు చేస్తామని, మొదటి బహుమతి రూ.60,116, రెండో బహుమతి రూ.40,116, మూడో బహుమతి రూ.20,116, నాలుగో బహుమతి రూ.10,116 నగదుతో పాటు మెమెంటోలను ఇవ్వనున్నట్లు యూత్ బాధ్యులు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 88975 29795, 96664 03331, 79972 57068 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

గాయనికి అవార్డు



అవార్డు అందుకుంటున్న పూజారి జ్యోతి

మణుగూరురూరల్: హనుమకొండలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో మణుగూరు మండలానికి చెందిన గాయని పూజారి జ్యోతికి విస్డం చారిటబుల్ ట్రస్ట్.. ఉమెన్ ఐకాన్–2025 అవార్డు అందించింది. జ్యోతికి అవార్డు రావడంపై తోటి గాయకులు, పట్టణ ప్రముఖులు అభినందనలు తెలిపారు.

దద్దరిల్లుతున్న బాంబుల మోత


ఆరెంపుల వాసుల ఆందోళన..



జిలెటిన్ స్టిక్స్ అమర్చేందుకు రాళ్లకు డ్రిల్ చేస్తున్న దృశ్యం

ఖమ్మంరూరల్: మండలంలోని ఆరెంపుల శివారు ఇరవై ఎకరాల భూమిలో కొందరు అనుమతి లేకుండా పేలుళ్లకు పాల్పడుతున్నారు. జనావాసాల నడుమ.. రాత్రింబవళ్లు బాంబుల (జిలెటిన్ స్టిక్స్)తో బండలను పేలుస్తుండగా రాళ్లు ఎగిరి పడుతుండడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. బండరాళ్లను పేల్చడానికి తోడు భూమిని చదును చేసేందుకు ఇప్పటికే వందకు పైగా తాటిచెట్లను నేలమట్టం చేయగా తాము జీవనాధారం కోల్పోతున్నామని గీతకార్మికులు వాపోతున్నారు. ఇంత జరుగుతున్నా మైనింగ్, ఎక్సైజ్ అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడకపోవడంపై స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి అక్రమంగా బ్లాస్టింగ్ చేసి, తాటిచెట్లను నరికివేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ అంశంపై రూరల్ సీఐ రాజును వివరణ కోరగా.. బ్లాస్టింగ్‌కు సంబంధించి ఎవరూ అనుమతులు తీసుకోలేదని స్పష్టం చేశారు. ఎవరైనా బ్లాస్టింగ్‌కు పాల్పడినట్లు తేలితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.20,871

అమ్ముదామా.. ఆగుదామా?!

మిర్చికి ఆశించిన ధర లేక సందిగ్ధంలో రైతులు

- నిల్వ చేయడానికే ఎక్కువ మంది మొగ్గు.. వ్యాపారులదీ అదే దారి
- విదేశీ ఆర్డర్లతో ధర పెరుగుతుందని ఆశలు
- నిండిపోతున్న కోల్డ్ స్టోరేజీలు



కోల్డ్ స్టోరేజీల వద్దకు మిర్చి తీసుకొచ్చిన వాహనాలు

ఖమ్మంవ్యవసాయం: ఆశించిన ధర రాకపోవడంతో మిర్చి రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ప్రతికూల పరిస్థితుల్లో సాగు చేసినా ఆశించిన దిగుబడి రాక.. వచ్చిన పంటకూ సరైన ధర దక్కక ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం ధర లేకపోవడంతో ఎక్కువ మంది నిల్వ చేయాలని భావిస్తున్నారు. మరోవైపు రైతుల నుంచి కొనుగోలు చేసిన వ్యాపారులు సైతం ఇదే నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. దీంతో ఏ కోల్డ్ స్టోరేజీ వద్ద చూసినా మిర్చి బస్తాలతో వచ్చిన వాహనాలు బారులుదీరి కనిపిస్తున్నాయి.

ఏడాదిలో ఎంత తేడా..

గతేడాది సీజన్‌లో క్వింటా మిర్చికి రూ.20 వేల నుంచి రూ.23వేల వరకు ధర పలకగా.. ఈ ఏడాది అందుకు భిన్నమైన పరిస్థితులు చోటుచేసుకున్నాయి. గత సంవత్సరం కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసిన మిర్చికి 2024 అక్టోబర్‌లో రూ.19 వేలు, నవంబర్‌లో రూ.18వేల ధర పలకగా.. ఈ ఏడాదిసాగు చేసిన మిర్చికి రూ.17వేల వరకు ధర పలికింది. అయితే ఆ తర్వాత ధర పతనం అవుతుండగా తొలి కోతలు కావడంతో మైలకాయకు ధర తక్కువ ఉండడం సహజమేనని భావించారు. కానీ రోజురోజుకూ ధర మరింత పతనం కాసాగింది. కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసిన మిర్చికీ ధర పడిపోయింది. డిసెంబర్‌లో నిల్వ మిర్చి క్వింటా ధర రూ.16 వేలకు, కొత్త మిర్చి ధర రూ.15,500కు, జనవరిలో నిల్వమిర్చి ధర రూ.14,500కు, కొత్త మిర్చి ధర రూ.15 వేలకు పడిపోయింది. ఇక ఫిబ్రవరిలో రెండో కోతగా నాణ్యమైన మిర్చి వచ్చినా ధరలో పురోగతి లేకవడంతో రైతులకు ఆవేదనే మిగిలింది. ఫిబ్రవరిలో గరిష్టంగా రూ.14వేలు, మోడల్ ధర రూ.13,500గా పలికింది.

కోల్డ్ స్టోరేజీల బాట..

మిర్చికి ప్రస్తుతం ఆశించిన ధర లేకపోగా.. ముమ్ముందు గిట్టుబాటు ధర వస్తుందనే ఆశతో రైతులు నిల్వకు ప్రాధాన్యత ఇస్తున్నారు. జిల్లాలో 2,17,360 మెట్రిక్ టన్నుల మిర్చి నిల్వచేసే సామర్థ్యం కలిగిన 48 కోల్డ్ స్టోరేజీలు ఉన్నాయి. ఫిబ్రవరి ఆరంభం నుంచే ధర ఆశాజనకంగా లేదని రైతులు పంట నిల్వ చేస్తుండగా, వ్యాపారులు భవిష్యత్‌పై అంచనాలతో నిల్వ పెడుతున్నారు. జిల్లాకు తోడు భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, సూర్యాపేట, నల్లగొండ జిల్లాల రైతులు కూడా ఖమ్మం బాట పడుతుండడంతో ఇక్కడ కోల్డ్ స్టోరేజీలన్నీ నిండిపోతున్నాయని తెలుస్తోంది.

అన్ సీజన్‌పై ఆశలు

ఈ ప్రాంతంలో పండించే 'తేజా' రకం మిర్చికి చైనా సహా పలు దేశాల్లో మంచి డిమాండ్ ఉంది. దీంతో అక్కడి ఆర్డర్ల ఆధారంగా ఎగుమతిదారులు కొనుగోలు చేయడంతో గత ఏడాది మంచి ధర పలికింది. కానీ ఈ ఏడాది ఆ పరిస్థితి లేక ధరలో పురోగతి లేనట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యాన అన్ సీజన్‌లో గతేడాది మాదిరిగా రూ.20 వేలు – రూ.23 వేల ధర వస్తుందనే ఆశతో అటు రైతులకు తోడు ఇటు వ్యాపారులు సైతం పంట నిల్వ చేస్తున్నారు.

పెట్టుబడులు కూడా రావని...



జనవరిలో 50 బస్తాల మిర్చి క్వింటాకు రూ.13,200 చొప్పున విక్రయించా. రెండో కోత పంటకు ధర పెరుగుతుందనుకున్నా ప్రయోజనం లేదు. ఇప్పుడు అమ్మితే పెట్టుబడి కూడా దక్కదని 42 బస్తాలు నిల్వ చేస్తున్నా.

– బానోత్ మట్టా, గోవింద్రాల, కామేపల్లి మండలం

జూన్ తర్వాత ఆలోచిస్తా...



ప్రస్తుత ధర పెట్టుబడులను పూడ్చే స్థితిలో లేదు. గత ఏడాది మిర్చి రూ. 20 వేలకు విక్రయిస్తే ఈసారి రూ.14 వేలే వచ్చింది. జూన్, జూలై తరువాత ధర పెరుగుతుందనే ఆశ ఉంది. అప్పటివరకు చూసి అమ్ముతా.

– చిరసవాడ రాజు, ఎదుళ్లచెరువు, తిరుమలాయపాలెం మండలం

శ్రీనివాస గిరి కల్యాణ ప్రచార రథం ప్రారంభం



ప్రచార రథం ప్రారంభిస్తున్న సీఈ శ్రీనివాసబాబు తదితరులు

పాల్వంచ: పట్టణంలోని శ్రీనివాస కాలనీ శ్రీనివాస గిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం(గుట్ట)పై మార్చి 24వ నుంచి 27 వరకు నిర్వహించే శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వార్షిక కల్యాణ మహోత్సవాలను విజయవంతం చేయాలని కోరుతూ చేపట్టిన ప్రచార రథాన్ని ఆదివారం కేటీపీఎస్ 7వ దశ సీఈ శ్రీనివాసబాబు, కొత్త వెంకటేశ్వర్లు, వైద్యులు బిక్కసాని సుధాకర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా భక్త సమాజ మండలి అధ్యక్షుడు ఆరుట్ల లక్ష్మణాచార్యులు మాట్లాడుతూ.. ప్రచార రథం ఉమ్మడి జిల్లా, చుట్టు పక్కల ప్రాంతాల్లో పర్యటించనుందన్నారు. కార్యక్రమంలో సునీల్‌కుమార్, ధర్మపురి రాము, ఊకె భద్రయ్య, కందుకూరి రామకృష్ణ, తాటికొండ శ్రీలత, వంకదారు నర్సింహకుమార్, మిట్టపల్లి నర్సింహారావు, కంతాల వెంకటేశ్వరరావు, బండి వెంకటేశ్వర్లు, కిలారు పురుషోత్తం, మేదరమెట్ల శ్రీనివాసరావు, బండి నారాయణ, ఏటుకూరి నరేశ్, రమేశ్, రాంజీ, వెంకి, వెంకట సుబ్బయ్య, చనుమోలు శ్రీనివాసరావు, కనగాల శ్రీనివాసరావు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఉత్పత్తులకు హైదరాబాద్‌లో విశేష ఆదరణ



ఉత్పత్తులను పరిశీలిస్తున్న హైదరాబాద్‌వాసి

కొత్తగూడెం అర్బన్/చుంచుపల్లి: కలెక్టర్ జితేశ్ వి పాటిల్ ఆలోచన మేరకు, 'ఎక్స్ ప్లోర్ భద్రాద్రి కొత్తగూడెం' కార్యక్రమంలో భాగంగా ఆదివారం హైదరాబాద్ మాదాపూర్‌లోని నాలెడ్జి సిటీలో ఓ ఆర్గనైజేషన్ నిర్వహించిన 'రన్ ఫర్ హర్' అనే కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి మహిళలు పాల్గొని తమ ఉత్పత్తులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో 10 కిలోమీటర్లు, 5 కిలోమీటర్లు, 3 కిలోమీటర్ల రన్ నిర్వహించగా సుమారు 1,000 మంది మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి మహిళలు స్వయంగా తయారు చేసిన కరక్కాయ టీపొడర్, తేనే, ఫ్లేవర్ తేనే, విప్పపూలు, విప్పనూనె, మిల్లెట్స్‌తో తయారు చేసిన మిల్లెట్ బిస్కెట్స్, గిరి ప్రాడక్ట్స్ అయిన సబ్బులు, న్యూట్రిమిక్స్, డ్రైమిక్స్ వంటి వివిధ ఉత్పత్తులు ఆకర్షణీయమైన ప్యాకింగ్‌లో ప్రదర్శించారు. ఈవెంట్‌లో పాల్గొన్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, వైద్యులు, వివిధ రంగాల్లో ఉన్న మహిళలు కొనుగోలు చేశారు. కార్యక్రమంలో డీపీఎం నాగజ్యోతి, ఏపీఎం వెంకయ్య తదితరులు పాల్గొని మహిళల ఉత్పత్తులకు ప్రోత్సాహం అందించారు.

ఎండిపోయి'నది'



జీవనదిగా పేరు గాంచిన భద్రాచలం గోదావరి ఎండిపోతోంది. మార్చి నెలలోనే ఎండలు మండుతుండటంతో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. ఐదు రోజులుగా భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 2.6 అడుగుల వద్ద నిలకడగా ఉంది. మార్చి 1వ తేదీన 3.6 అడుగులు ఉండగా, 2వ తేదీన 0.4 అడుగులు తగ్గి 3.1కి చేరుకుంది. గతేడాది జూలైలో వచ్చిన వరదలు మినహాయించి, గోదావరిలో నీటిమట్టం తక్కువగానే ఉంది. గతేడాది నవంబర్ 7వ తేదీ నుంచి ఇప్పటి వరకు భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 10 అడుగులు మించి ప్రవహించలేదు. క్రమక్రమంగా తగ్గుతూ 2.6 అడుగులకు చేరిది. – భద్రాచలంఅర్బన్

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన





స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు (ఇన్‌సెట్) భద్రాచలం రామాలయం ఈఓ రమాదేవితో సభ్యులు

అశ్వాపురం: మండలంలో నూతనంగా నిర్మించిన శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. పల్లె ప్రకృతి వనంలో ఆంజనేయస్వామి విగ్రహానికి ప్రాణ ప్రతిష్ఠ చేపట్టారు. రామాలయంతో పాటు అంతర్భాగంలో ఆంజనేయస్వామి, శివాలయం, విఘ్నేశ్వరస్వామి ఉపాలయాల్లో విగ్రహాలు, నవగ్రహాల విగ్రహాలు ప్రతిష్ఠించారు. రామనామస్మరణతో మొండికుంట మారుమోగింది. సీఐ అశోక్‌రెడ్డి, ఎస్‌ఐలు తిరుపతిరావు, రవూఫ్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. యాగశాల వద్ద భక్తులకు మహా అన్నదానం నిర్వహించారు. భక్తరామదాసు మునిమనమడు కంచర్ల శ్రీనివాసరావు, భద్రాచలం రామాలయం ఈఓ రమాదేవి, మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సీఐ అశోక్‌రెడ్డి దంపతులు, డీసీసీబీ డైరెక్టర్, కాంగ్రెస్ జిల్లా నాయకులు తుళ్లూరి బ్రహ్మయ్య, మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

మేడూరు పుణ్యక్షేత్రానికి పాదయాత్ర

మధిర: పట్టణంలోని బంజారాకాలనీలో ఉన్న శ్రీ లక్ష్మీపద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయం నుంచి కలయిక వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం మేడూరు పుణ్యక్షేత్రానికి పాదయాత్ర చేశారు. ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం మేడూరులో ఉన్న శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయానికి వెళ్తున్న పాదయాత్రను స్థానిక బంజారాకాలనీ వద్ద కలయిక వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు ఇరుకుళ్ల బాలకోటేశ్వరరావు ప్రారంభించారు. మేడూరు ఆలయంలో తొలుత వాకర్స్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

మనువాదం ప్రజలను పీడిస్తోంది

- ప్రజా పోరాటాల్లో పెద్దన్న రవన్న
- వర్ధంతి సభలో వీపీవీ నేత పట్నాయక్



మాట్లాడుతున్న రమేష్ పట్నాయక్, పక్కన నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్ : దేశంలో మనువాదం, మార్కెట్ భావజాలం అనే కవల పిల్లలు ప్రజలను పీడిస్తున్నాయని, దీనికి వ్యతిరేకంగా ప్రజలు సమరశీల పోరాటాలు నిర్వహించాలని విద్యా పరిరక్షణ వేదిక జాతీయ నాయకులు రమేష్ పట్నాయక్ పిలుపునిచ్చారు. ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో సీపీఐ (ఎంఎల్)మాస్‌లైన్-రవన్న మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం రాయల సుభాస్ చంద్రబోస్ (రవన్న) 9వ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ పట్నాయక్ మాట్లాడుతూ.. దేశ సంపదను లూటీ చేసేలా కార్పొరేట్ శక్తులకు పాలకులు సేవ చేస్తున్నారని అన్నారు. పేదలను మరింత బలహీనంగా మారుస్తూ సోమరిపోతులుగా చూస్తున్నారని విమర్శించారు. నిత్యావసరాల ధరలు మండుతున్నాయని, కోట్లాది కుటుంబాలు పేదరికంలో కూరుకుపోతుంటే కార్పొరేట్ వర్గాల వారు శత కోటీశ్వరులుగా మారుతున్నారని అన్నారు. ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్య, వైద్యం విద్యుత్, సాగు, తాగునీరు, సేవా రంగం, సంక్షేమ పథకాలు ఇవన్నీ ప్రజలకు అందించాల్సిన బాధ్యత పాలకవర్గాలపై ఉందన్నారు. ప్రముఖ సంపాదకులు సతీష్ చందర్ మాట్లాడుతూ సమాజంలో అన్ని రంగాలను పెట్టుబడిదారీ వ్యవస్థ నియంత్రిస్తోందన్నారు. మనువాద చాందస భావాలకు వ్యతిరేకంగా సమష్టిగా ఉద్యమించాలని కోరారు. సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు కేజీ రామచందర్ మాట్లాడుతూ రవన్న అతివాద, అవకాశవాదాలకు వ్యతిరేకంగా అంతర్గత పోరాటం చేసి విప్లవోద్యమాన్ని సరైన దిశలో నడిపారని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య, నాయకులు కెచ్చల రంగయ్య, గుర్రం అచ్చయ్య, కె.రమ, గోకినపల్లి వెంకటేశ్వర్లు, చంద్ర అరుణ, ముద్ద భిక్షం, పుసులూరి నరేందర్, చిన్న చంద్రన్న, హన్మేశ్, ఎస్ఎల్ పద్మ, ఆవుల వెంకటేశ్వర్లు, సి.వై.పుల్లయ్య జి.రామయ్య, మనోహర్ రాజు, కల్పన, ఆవుల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సమానత్వం కోసం ఉద్యమించాలి



మాట్లాడుతున్న అందే మంగ

భద్రాచలంఅర్బన్: మహిళలంతా సామాజిక, రాజకీయ, ఆర్థిక సమానత్వంపై ఉద్యమించాలని, మహిళలపై జరుగుతున్న హింసను తిప్పికొట్టాలని ప్రగతి శీల మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందే మంగ పిలుపునిచ్చారు. పీఓడబ్ల్యూ జాతీయ కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా ఆదివారం భద్రాచలంలోని గిరిజన అభ్యుదయ భవన్లో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం సదస్సు పీఓడబ్ల్యూ జిల్లా నాయకురాలు కప్పల సూర్యకాంతం అధ్యక్షతన నిర్వహించారు. అందే మంగ మాట్లాడుతూ.. నాడు గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం మొత్తం దెబ్బతిని పరిశ్రమలకు పనికి వెళ్లిన వారిని శ్రమదోపిడీ చేసి విశ్రాంతి తీసుకుంటే కూడా వేతనం కట్ చేసి ఇచ్చేవారని, ఈ దోపిడీ నుంచి పుట్టిన పోరాట ఫలితమే అంతర్జాతీయ మహిళా దినోత్సవం అని పేర్కొన్నారు. సభలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి గొని నాగేశ్వరరావు, భద్రాచలం డివిజన్ కార్యదర్శి ముసలి సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

తల్లి పాడె మోసిన కుమార్తెలు



కన్నతల్లి పాడె మోస్తున్న కూతుర్లు

పినపాక: కన్న తల్లి చనిపోవడం.. ఆమెకు కొడుకులు లేకపోవడంతో కూతుర్లు పాడె మోసిన ఘటన మండలంలోని ఎల్చిరెడ్డిపల్లి గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎల్చిరెడ్డిపల్లికి చెందిన నూతి అనసూర్య (70) అనారోగ్యంతో మృతి చెందింది. ఆమెకు కొడుకులు లేకపోవడంతో కూతుర్లు నాగమణి, రమణ పాడె మోసి తలకొరివి పెట్టారు. ఈ ఘటన పలువురుని కంటతడి పెట్టించింది.

మున్నేటిలో పడి విద్యార్థి మృతి

ఖమ్మంరూరల్: మండలంలోని గోళ్లపాడు వద్ద మున్నేటిలో ప్రమాదవశాత్తు పడి విద్యార్థి ఎర్రం మహేశ్ (22) మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం .. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం మొగళ్లపల్లి గ్రామానికి చెందిన మహేశ్ ఖమ్మంలోని ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో బీకాం ఫైనలియర్ చదువుతూ.. గట్టయ్యసెంటర్‌లో స్నేహితులతో కలిసి అద్దెకుంటున్నాడు. కాగా, ఈ నెల 8న స్నేహితులతో కలిసి కాల్వ వద్దకు వెళ్లి అందులో పడి గల్లంతయ్యాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అన్నం ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు, సిబ్బంది సాయంతో మృతదేహాన్ని వెలికితీశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజు తెలిపారు.

చెట్టుకు ఢీకొన్న బైక్: ఒకరు మృతి

మరొకరి పరిస్థితి విషమం



జోగా వంశీ (ఫైల్)

టేకులపల్లి: వేగంగా వచ్చిన బైక్ చెట్టును ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరి పరిస్థితి విషమంగా మారిన ఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ సురేశ్ కథనం ప్రకారం.. కారేపల్లి మండలం ఉసిరికాయలపల్లి గ్రామానికి చెందిన జోగా వంశీ (22), పొడుగు ప్రవీణ్ బైక్‌పై టేకులపల్లి మండలంలో శుభకార్యానికి వచ్చారు. తిరుగు ప్రయాణంలో వేగంగా బైక్ నడుపుతూ తుమ్మలచెలక క్రాస్ రోడ్ సమీపంలో అదుపుతప్పి చెట్టుని ఢీకొట్టారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ స్థానికులు కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించగా.. వంశీ మృతి చెందాడు. ప్రవీణ్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

చండ్రుగొండ: మండలంలోని తిప్పనపల్లి వద్ద ఎదుళ్లవాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా శనివారం రాత్రి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్ఐ శివరామకృష్ణ ఆదివారం తెలిపారు. డ్రైవర్ అంచ రమేశ్, ట్రాక్టర్ యజమాని పి.రాధాకృష్ణపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

పాల్వంచరూరల్: కుటుంబ కలహాల కారణంగా ఓ మహిళ ఇంట్లో ఉన్న మాత్రలు అధికంగా మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన పాత సూరారంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని పాత సూరారం గ్రామానికి చెందిన 28 ఏళ్ల మహిళ ఆదివారం ఇంట్లో గొడవల కారణంగా మాత్రలు అధికంగా మింగడంతో అపస్మారకస్థితికి చేరింది. కుటుంబ సభ్యులు పాల్వంచ ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతోంది.

టీం ఇండియా విజయంతో సంబురాలు



దుమ్ముగూడెంలో విజయోత్సాహంతో యువత

దుమ్ముగూడెం: టీం ఇండియా చాంపియన్స్ ట్రోఫీలో విజేతగా నిలవడంతో మండలంలో సంబురాలు అంబరాన్ని అంటుకున్నాయి. ఆదివారం దుబాయ్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో హోరాహోరిగా జరిగిన న్యూజిలాండ్ ఇండియా ఫైనల్ మ్యాచ్‌లో టీం ఇండియా జట్టు విజేతగా నిలవడంతో లక్ష్మీనగరం గ్రామంలోని క్రీడా అభిమానులు బాణాసంచా కాల్చుతూ మిఠాయిలు పంచారు. జై భారత్.. జైజై భారత్ అంటూ నినాదాలు చేస్తూ గ్రామంలో ద్విచక్ర వాహనాలతో ర్యాలీని నిర్వహించారు.